నోట్:-తక్కువ! వస్తుసామగ్రి (కప్పేగుడ్డ, శర్రలు వగైరా) దృష్ట్యా చూస్తే తక్కువ.

* * *

నేను గబగబా మెట్లెక్కేను. సాయంకాలమై పోయింది. కొంతసేపట్లో లైట్లు వెలుగుతాయి. ఓ బనీనూ గావంచాకట్టుకొని తమ్ముడుగారు ఇంకో పుస్తకానికి చిహ్నాలు తగిలిస్తున్నారు.

'హిందీ సాహిత్యానికి ప్రోత్సాహ మివ్వడం కొరకు ప్రభుత్వం తరఫునుండి ఒక సమితి నియమించబడ్డది. 16 పురస్కారాలు ప్రతిసంవత్సరం సాహిత్యకారులికి తప్పకుండా ఇవ్వబడతాయి.'

రేఖాంకితం చేసింతరవాత ఇక నోట్ రాస్తాడనగా నేను అతనిచేతిలోంచి పుస్తకాన్ని లాక్కుంటూ అన్నాను— "ఏమిటీ చేస్తున్నావ్? నా ఉద్యోగం విషయమై కూడా నీకు ఆలోచన లేదు! ఇంకేపనీలేదా?"

అతను స్తబ్ధుడైపోయేడు. "అన్నయ్యా! నాకు పదిహేను రూపాయల ట్యూషనొక టుండేది. ఇప్పుడు అదీలేదు. అంచేతే యిప్పుడు ఎక్కడికీ వెళ్ళడంలేదు"అన్నాడు.

* * *

"అయ్యగారు! ఆ పిచ్చివాడికి నేనేం చెప్పేది. బాబూ తమరే తల్లీ తండ్రీను. అంతా యెరుగుదురు. వాడి విషయంలో తప్పుగా అనుకోకండి. చూడండి! తమరు చాలామందిని పోషిస్తున్నారు, చాలరోడ్లు వేయిస్తున్నారు, ఆస్పత్రులు తెరిపిస్తున్నారు, కాలువలు త్రవ్విస్తున్నారు. అయితే కాస్తోకూస్తో ఇటూ అటూ అవుతూ నేవుంటుంది. ఇంతలో ఏవఁయింది? నేననేది, ఎక్కడవ్వటంలేదని? ఏదికళంకంలేనిది? కాని కాదు; గ్రాడ్యుయేటు. ఆశలున్నాయి, నిరుద్యోగి. ఏవీ తెలీటంలేదు. పిచ్చాడై పోయేడు బాబూ!"

అఫీసరుగారు కళ్ళద్దాల్లోంచి హుూంకరిస్తున్నట్టు ఓసారి చూసి కానన్ డైల్ అపరాధ పరిశోధక నవల్లో మునిగిపోయేరు.

---

స్కెచ్

# అర్థం : అంతరార్థం

మా. త. శాస్త్రి

కొన్ని వాస్తవిక విషయాలు కల్పనలకంటె అభూత కల్పనలా ఉంటాయి. ఈ అభూత కల్పనలు నిత్యజీవితంలో సాక్షాత్తు సంఘటించినవే! ఈ మధ్య ఎన్నికలలో అలాంటిదే సంభవించింది. చూచినవారు కళ్ళను నమ్మలేదు. విన్నవారు చెవులను నమ్మలేదు. అంతచిత్రంగా ఉన్నది ఈ సంఘటన—

కథను వద్దాం. అది పాతపల్లి. ఒక కుగ్రామం అయినా ఈ కుగ్రామం రాజకీయ ప్రసిద్ధిగాంచిన గ్రామం. ఉప్పు సత్యాగ్రహం రోజుల్లో లాఠీ దెబ్బలు తిన్నవారూ, "వద్దురా మనకొద్దురా, ఈ పరిపాలనము మనకొద్దురా, హద్దూ పద్దూలేని పన్నులు" ఉద్యమంలో జయిళ్ళకెళ్ళినవారూ, ప్రభుత్వస్థాపన సమయంలో ఎసంబ్లీకి ఎన్నిక అయినవారూ ఉన్న గ్రామమే! ఈ రోజుకు కూడావిదేశీవస్తు బహిష్కరణ ఉద్యమంలో గోడల లోపలికి చెక్కబడిన నినాదాలు కనిపిస్తూనే ఉంటాయి. రెండవప్రపంచ మహా సంగ్రామంలో సహాయ నిరాకరణోద్యమంలో లాఠీదెబ్బలతిని పక్షవాతరోగిగా మారిపోయిన మనుష్యులూ అగుపిస్తూ ఉంటారు. మొత్తానికి ఈ పాతపల్లి పాతబడిన రాజకీయ కుగ్రామం!

ఈ గ్రామంలో పాతబడిన రాజకీయాలే కాదు. నూతన, నవనూతన రాజకీయాలుకూడా వెన్నువిరచి గింజలుగా మూరి చెలామణీ అవుతున్నాయి. అందులో విప్లవకర పార్టీ బహుప్రధానమయింది.

ఎన్నికల సందర్భంలో, విప్లవకర పార్టీ ఒక ప్రతినిధిని ఎన్నుకొన్నది. ఈ ప్రతినిధిని గెలిపించడానికి హోరాహోరీ పోరాటం జరుపుతోంది. ఈ పోరాటం విజయవంతం కావడంకోసం, ప్రచారం

ప్రారంభించింది. ఈ ప్రచారం సక్రమం కావడం కోసం, అన్యభాషా ప్రాంతాలనుండి నాయకులను రప్పించింది. ఉపన్యాసాలు యిప్పించింది. ఊరేగింపులు జరిపించింది.

హఠాత్తుగా భూపాలన్ ప్రత్యక్షమయ్యాడు. విప్లవాత్మక పార్టీలో అగ్రగణ్యుడు. దేశాంతర సీమలు సందర్శించిన మనిషి. కుగ్రామం అయినప్పటికీ, రాజకీయంగా ముఖ్యమైన గ్రామమే కాబట్టి భూపాలన్ సంచార కార్యక్రమంలో పాతపల్లిచేరుకున్నాడు.

సభ అన్నారు. ఊరేగింపులు జరిపారు. మేళాలు మేళవింపజేశారు. బాజాలు, భజంత్రీలు మిన్ను ముట్టించారు. ఉపన్యాసం వినడానికి పదులు, వందలు, వేలు ఆడా మొగా వేంచేశారు.

సభ ప్రారంభమయింది.

సుబ్బారాయుడు వేదిక అధిష్టించి భూపాలన్ గారిని ప్రజలకు పరిచయంచేశాడు. సుబ్బారాయుడు పాతపల్లి విప్లవపార్టీ నాయకుడు. సుబ్బారాయుడి ఉపన్యాసం డబ్బారాయుడి మోతలాగ ఉంటుంది.

భూపాలన్‌గారు ఆంగ్లంలో ఉపన్యసించడం ప్రారంభించారు. సుబ్బారాయుడు జాను తెలుగులో అనువదించడం మొదలిడాడు.

భూపాలన్: We want to defeat Congress Party.

సుబ్బా: మేం కాంగ్రెస్‌ను కాళ్ళుపెట్టి రాసేస్తాం.

భూపా: We want to prove that people are not in favour of the Congress Party.

సుబ్బా: మేం కాంగ్రెసును నామరూపాలు లేకుండా తుడిచిపెట్టి, బుద్ధిచెపుతాం.

భూ: Please vote for us

సు: ఓటులన్నీ మావి. ఘంటాపదంగా చెప్ప గలం. ఓటుల్లో మాదే విజయం!

భూ: We are for the poor. The Congressis for the rich.

సు: మేం బీదవాళ్ళం. బలవంతులం. కాంగ్రెస్ ధనవంతమయింది. చాల బలహీనమయింది. మేం మా బలంతో కాంగ్రెస్‌ను చావగొట్టి చెవులు మూస్తాం!

ఉపన్యాసం, అనువాదం ఈ స్థాయిలో సాగుతున్నాయి. మధ్యలో ఒక పల్లెటూరి బడిపంతులు హఠాత్తుగా లేచి ఏదో చెప్పబోయాడు. సుబ్బారాయుడు గట్టిగా అరిచాడు. గుండెలు బాదుకున్నాడు. "అదుగో పెట్టుబడిదారుల ఏజంటు. పట్టండి, కట్టండి, కొట్టండి." తత్క్షణం నలుగురు 'నిక్కరు ధరించిన' కుర్రాళ్ల సభలోకి వాలారు. బడిపంతుల్ని సాగనంపారు. 'అనువాదం...' ఏదో చెప్పబోయాడు. అతని నోటిమీద అరచేతులు ఛళ్ళుమన్నాయి!

రెండో రోజున సుబ్బరాయుణ్ణి బడిపంతులు కలుసుకొని సంజాయిషీ యిచ్చుకున్నాడు. విప్లవ పార్టీ ప్రాంతీయ నాయకుడు సుబ్బారాయుడు పంతులి భుజం తడుతూ, "...మాది విప్లవాత్మక పార్టీ. మా పార్టీ నిర్మాణయుక్తమైన పార్టీ... మా పార్టీకి ఒక సుస్థిరమైన ప్రణాళిక ఉన్నది. ఏ మనిషి అయినాసరే ఈ ప్రణాళికనే అనుసరించి ఉపన్యసించాలి. అతను ఏ భాషలో ఉపన్యసిస్తే మాకేం? ఏ భాషలో చెప్పినా, మా ప్రణాళికలో నుంచే చెప్పాలి. ఆ పాఠమే వర్ణించాలి...

ఇంతకంటె వాడికి చెప్పడానికి హక్కు లేదు. అలాంటప్పుడు నాకు ఇంగ్లీషు రానక్కరలేదు... అతను ఆంగ్లభాషలో ఏది ఉపదేశించినా, ఇదే ఐ ఉండాలి. కాబట్టి నేను తెలుగులో ఉద్రేక పూరితంగా చెప్పుతున్నాను. అసలు మా పాలసీ అతనిచే ఉపన్యాసాలు కురిపించడంకాదు! జనానికి మేం చెప్పదలచుకున్నది చెప్పడం. మేం కల్పించాలనుకున్న అభిప్రాయాలు కల్పిస్తున్నాం. మా అభిమతం ప్రజల అభిమతంగా మార్చదలచుకున్నాం. అందుకు ఏ సాధనాన్నైనా సరే విని యోగిస్తాం. ఏ మార్గాన్నైనా సరే అనుసరిస్తాం." బడిపంతులు నోరు ఆవలించి విన్నాడు 'చిత్తం' అన్నాడు.

"ఇవి రాజకీయ కీలకాలు కాబోలు. నాకు తెలీదు బాబూ. నేను సాహిత్యం అనుకున్నాను-రాజకీయాలు ఇలానే ఉంటాయి కాబోలు..." అనుకుంటూ అడుగులు లెక్కించుకుంటూ ముందుకు నడిచాడు! నిక్కరు కుర్రాడు. ఉరుముతూ చూశాడు బడిపంతులు వైపు. ★

స్కెచ్

# టీ కప్పులో తుఫాను

కూరపాటి శ్రీరామ్

ఇంకా ఆరయిందో లేదో వేసవి అవడంమూలాన్న ఎండ పొడుచుకుని వస్తూంది. అయినా, ఇంకా రాజారావు లేవలేదు. ఈ రాజాగాణ్ణి చూస్తుంటే నాకు చాలా తమాషాగా ఉంది. నాలుగురోజు లయింది ఇక్కడికి వచ్చి. అయినా ఒక్కసారైనా ఇంటికి పోతానని అనడు. అసలు చిన్నచిన్న విషయాలకి ఇలా పెద్ద రభస చేసే పెద్ద మనుషులను యేమనాలో నాకర్థం కావడంలేదు.

పదిపదిహేను రోజులనించీ నేనూ రాజా కలవడమే కుదిరిందికాదు. అలాటప్పుడు రాత్రి ఏడు గంటలకి-నాలుగురోజులక్రితం,రాజారావడంనాకాశ్చర్యంవేసింది.'ఏమిటి రాజా? ఇలావచ్చావేం?'అడిగాను.తర్వాతచెప్పేడు రాజా తన కారణం.

* * *

ఆవేళ రాజారావు ఆఫీసునుంచి ఇంటికి అయిదు గంటలకి మామూలుగా వచ్చేశాడు. రాగానే సరస్వతితో "చూడు సరూ! వచ్చే సోమవారం నాడు రామం పెళ్ళిట. మనల్ని రమ్మని మరీమరీ కోరుతూ ఉత్తరం రాశాడు. వస్తావు కదూ! మనం తప్పక వెళ్లాలి" అన్నాడు.

"రామమా? ఏ రామం? ఎవరూ? మీరు చెప్పేదేదీ నాకర్థం కావడంలేదు. అందరికీ అర్థమయేటట్లు మాట్లాడ్డం మీకెప్పు డలవడుతుందో గదా" అంది సరస్వతి నవ్వుతూ,

"బాగుబాగు. రామం తెలీదా?మా మామయ్య తోడల్లుడి తమ్ముడి కొడుకు. మన పెళ్ళిలోకూడా నా తరఫు నానా హంగామా చేసేడే—వాడి పెళ్ళి అర్థమయిందా ఇప్పుడు?"

"సరి తెలిసింది. కాని నేను మాత్రం రాను. ఆ పెళ్లికి ఛస్తే రాను," సరస్వతి అదేదో తనిదివరకే నిర్ధారణ చేసుకున్నట్లు అంది.

రాజా అదిరిపడ్డాడు:"ఏం ఎందుకురావూ?తప్పకుండారావాలి. ఇది నీ ఇష్టంకాదు తెలుసా?నువ్వెందుకురావోచూస్తాకదా? తమాషాకున్నావా యేం?"

"తమాషామాత్రం కాదు. నేనుమట్టుకు రాను" అని ఒక నిమిషం ఆగి, "మొన్నమట్టుకు మొన్న మా నాన్నకి అస్వస్థతగా ఉందని ఉత్తరం వస్తే మీరేమన్నారు? 'నాకు వీలులేదు: ఆఫీసులో సెలవు దొరకదు. ఇంత అర్జంటుగా ఉత్తరాలు రాస్తే ఇదేమన్నా గవర్నమెంటు నౌకరీయా లేకపోతే మరేమిటో అనుకున్నాడా మీ నాన్నకిమాత్రం బుద్ధి ఉండొద్దూ?" అని అన్నారే! అప్పుడు దొరకని సెలవు ఇపుడు దొరికిందా? దొరికిందే అనుకోండి.

మరి రెణ్ణెల్లక్రితం మా పినతల్లికూతురు సుబ్బులు పెళ్ళికి రమ్మన్నా సెలవు దొరకలేదని నీ కిష్టమైతే నువ్వొకత్తవే వెళ్లు అని అన్నారే నేనెన్ని చెప్పినా వినిపించుకోకుండా. సుబ్బులూ, నేనూ ఒకేతల్లి పిల్లల్లాగ పెరిగేమే! నేనొక్కదాన్నే యెలా వెడతాననే ధీమాతో అలా అనగలిగేరు?

నిన్న సాయంకాలం సినిమాకి రమ్మంటే ఏడింటికి ఇంటికివచ్చి మరో కుంటిసాకా? ఇలాటప్పుడు యెక్కడో మీ మామయ్య తోడల్లుడి తమ్ముడి కొడుకు పెళ్ళికి నే మాత్రం యెలా వస్తాను? నేను రానుగాకరాను" అంటూ ముగించింది సరూ.

రాజాకి ప్రపంచమే తలక్రిందులైనట్లనిపించింది. ఇన్నాళ్ళూ ఏ విషయానికీ పల్లెత్తుమాటకూడా యెదురాడని సరూ యిలాగ యెదురు తిరగడం రాజాకి నచ్చలేదు. సరూలోని ఆవేశం ఉడుకెత్తిన లావాలాగ ద్రవించడం చూస్తే రాజాకి ఆశ్చర్యంవేసింది. స్త్రీదరుగారి అమ్మాయికి ఎదురాడడం చేతగాక అతన్ని అవమానం ఆవరించింది. అతని మానవత్వం అవధులుదాటి పోయింది.

ఏమైనా తను మగాడు కాబట్టి మగత్వం రుజువుచేసుకుందుకు సరూపై చేయిజేసుకున్నాడు. అంతే! "ఛీ ఛీ, ఈ ఇంటికన్నా నరకంనయం, నేనుచెప్పే ఏ మాటా నువ్వు లెక్కచెయ్యడం లేదు" అంటూ బయటికి వచ్చేశాడు.